# స్వచ్ఛ నగరం.. పందుల సంచారం

- ఏలూరులో కానరాని స్వచ్ఛత
- వరాహాల స్వైరవిహారం
- మూడు రోజులకు ఒకసారి చెత్త సేకరణ
- గుట్టలు గుట్టలుగా పేరుకుపోతున్న చెత్త
- వీధుల్లో దుర్గంధం



ఏలూరులోని ఒక ప్రాంతంలో చెత్తకుప్పల వద్ద పందుల సంచారం



చెత్తకుప్ప వద్ద పందుల గుంపు

**ఏలూరు (ఆర్‌ఆర్‌పేట):** ఏలూరును స్వచ్ఛ నగరంగా పాటిస్తామంటూ ప్రజా ప్రతినిధులు, అధికారులు ఇటీవల ప్రతిజ్ఞ చేశారు. ప్రజలు, విద్యార్థులతో కూడా ప్రతిజ్ఞ చేయించారు. ఫొటోలు, వీడియోలు మీడియాలో పెట్టి ప్రచారం చేశారు. ఈ నేపథ్యంలో నగరంలో మురుగు, చెత్తా చెదారం, పందులు, కుక్కలు ఉండవని ఆశించిన ప్రజల సంతోషం ఒక రోజులోనే ఆవిరైంది. నగరంలో ఎక్కడా స్వచ్ఛత మచ్చుకి కూడా కనిపించడం లేదు. ప్రతి రోజూ ఇంటికొచ్చి చెత్త తీసుకువెళ్లాల్సిన పారిశుద్ధ్య సిబ్బంది మూడు రోజులకు ఒకసారి వస్తుండడంతో ఎక్కడికక్కడ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. వీధులన్నీ మురుగు కంపు కొడుతున్నాయి.

**దుర్గంధంతో ఇబ్బందులు**

ఏలూరులో ప్రస్తుతం ఎక్కడ చూసినా చెత్త కుప్పలు కనిపిస్తుండడంతో పందుల సంచారం పెరిగింది. ప్రజలు వేసే చెత్తేకాక, మూడు రోజులకు ఒకసారి వచ్చే పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికీ తిరిగి సేకరించిన చెత్తను రెండు వీధులకు ఒక ప్రాంతంలో ఏర్పాటు చేసిన చెత్త కుండీ వద్ద వేస్తున్నారు. ఈ చెత్తను తరువాత ట్రాక్టర్‌తో వచ్చి తీసుకువెళుతున్నారు. అయితే ట్రాక్టర్ వచ్చి తీసుకెళ్లేలోపే పందులు ఆయా ప్రాంతాల్లో వేసిన చెత్తను చిందరవందర చేస్తూ దుర్గాంధాన్ని మరింత పెంచుతున్నాయి. దీంతో వైఎస్సార్‌సీపీ హయాంలో ఇటువంటి పరిస్థితి ఉండేదికాదని ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు.

**అనారోగ్యానికి హేతువు**

నగరంలో విచ్చలవిడిగా తిరుగుతున్న పందుల వల్ల అనారోగ్యాలు పెరిగే ప్రమాదముందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కరోనా అనంతరం ప్రజలు ఎటువంటి వైరస్‌లు ప్రబలినా తొందరగా అనారోగ్యానికి గురవుతున్నారు. వారిలో రోగ నిరోధక శక్తి పడిపోవడంతో గుండెపోటు, ఇతర వ్యాధులతో మృత్యువాత పడుతున్నారు. ఈ నేపథ్యంలో పందుల సంచారం ప్రజలను మానసిక ఆందోళనకు గురిచేస్తోంది. పిల్లల పందులు స్థానికులపై కూడా దాడులకు దిగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు పందులు ఉన్నచోట రాకపోకలు సాగించేందుకు హడలిపోతున్నారు.

**చోద్యం చూస్తున్న అధికారులు**

పందుల పెంపకం లాభసాటిగా ఉండడంతో పందుల పెంపకం దారులు ఒక మాఫియాగా తయారయ్యారని ప్రజలు వాపోతున్నారు. పంది మాంసానికి నగరంలో గిరాకీ ఉండడంతో పందుల పెంపకాన్ని విడిచిపెట్టే ప్రసక్తే లేదని పెంపకందారులు అధికారులకు కరాఖండిగా చెబుతున్నారు. పెట్టుబడిల లేకుండా పందులను వీధుల్లోకి ఒదిలేస్తే అవే పెరిగి పెద్దవై మంచి ఆదాయ వనరుగా మారడంతో పెంపకందారులు ప్రజాప్రతినిధులకు, అధికారులకు మామూళ్లిచ్చి పందుల సంచారాన్ని నియంత్రించకుండా కాపాడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అధికారులపై ఎన్ని విమర్శలు వస్తున్నా పందుల విషయంలో పట్టించుకోవడంలేదనే విమర్శలు వస్తున్నాయి.

**ఫిర్యాదుదారులపై దాడులు**

నగరంలో పందుల సంచారాన్ని అరికట్టాలని సామాజిక కార్యకర్తలు నగరపాలక సంస్థ అధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రాలు అందించినా అవి బుట్టదాఖలే అవుతున్నాయి. ఇలా ఫిర్యాదులు చేసిన వారిపై పందుల పెంపకందారులు భౌతికదాడులకు పాల్పడిన ఘటనలూ గతంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఫిర్యాదులు చేయడానికి కూడా సామాన్యులు వెనుకడుగు వేయాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు పందుల సంచారాన్ని అరికట్టాలని నగర ప్రజలు కోరుతున్నారు.

## పందుల దాడులు



వీధుల్లో పందుల సంచారం ఎక్కువైంది. పిల్లల పందులు దాడిచేసి మనుషులను కరుస్తున్నాయి. వాటి నుంచి తప్పించుకోవడం కష్టమవుతుంది. డ్రైయిన్లలో దిగి మురుగును చిందరవందర చేసి దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. వాటి సంచారం అధికంగా ఉండడంతో చంటి పిల్లలు అనారోగ్యం పాలవుతున్నారు. ఫిర్యాదు చేసినా పట్టించుకొనే వారు కరువయ్యారు.

– గొంగడ కుమారి, గృహిణి

## స్పందన కరువు



వీధుల్లో చెత్తకుప్పలు పెరిగిపోవడంతో పందులు ఇష్టారాజ్యంగా సంచరిస్తూ చెత్తను చిందరవందర చేస్తున్నాయి. పందులను అదుపు చేయాలని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. గతంలో ఫిర్యాదులు చేస్తే కొద్దికాలమైనా వాటిని నియంత్రించేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. చెత్త కుప్పలు, పందుల సంచారం నగరంలో ఎక్కువైంది.

– కాకర్లమూడి రమేష్ బాబు, స్థానికుడు

## నేడు ఆటో డ్రైవర్ల చలో కలెక్టరేట్



ప్రచార యాత్రలో పాల్గొన్న ఆటో డ్రైవర్లు, సీఐటీయూ నాయకులు

**ఏలూరు (టూటౌన్):** రాపిడో, ఉబర్, ఓలా సంస్థల వాహనాలను వ్యతిరేకిస్తూ ఆటో డ్రైవర్లు ఈ నెల 4న నిర్వహించే చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని కోరుతూ ఆటో స్టాండ్‌లలో ప్రచార యాత్ర నిర్వహించారు. గురువారం ఉదయం పాత బస్టాండ్ సెంటర్ నుంచి ప్రచార యాత్ర బయలుదేరింది. కార్యక్రమంలో ఏలూరు జిల్లా ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపి మాట్లాడారు. ఏలూరులో దాదాపు 5 వేల మంది ఆటో డ్రైవర్లు ఉన్నారని తెలిపారు. ఆటో స్టాండ్‌ల వద్ద కిరాయిలు వచ్చే సమయానికి రాపిడ్ వంటి సంస్థల వాహనాలు ప్రయాణికులను తరలించుకుపోవడాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు ఆదాయాన్ని సమకూరుస్తున్న ఆటో డ్రైవర్లకు, వారి కుటుంబాలకు రక్షణ చేకూరేలా సమగ్ర సంక్షేమ చట్టాన్ని (వెల్ఫేర్ బోర్డు) ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏలూరు నగర పాలక సంస్థ పరిధిలో ఆటో స్టాండ్‌లకు షెల్టర్‌తో కూడిన పార్కింగ్ స్టాండ్లను ఏర్పాటు చేయాలని, ఆటోల కొనుగోలుకు సబ్సిడీతో కూడిన రుణాలను ఇవ్వాలని కోరారు. ప్రచార యాత్రకు అడ్డాల రాజు (నాని), బి.చంద్రశేఖర్, చక్రాల అమర్ కుమార్, వై.బాలాజీ, ఇ.విజయ్ కుమార్ నాయకత్వం వహించగా పెద్ద సంఖ్యలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఆశ్రమాలకు నిత్యావసరాల పంపిణీ



వృద్ధాశ్రమంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేసిన ప్రతినిధులు

**ఏలూరు (ఆర్‌ఆర్‌పేట):** నగరానికి చెందిన రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం నగరంలోని వివిధ ఆశ్రమాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేసింది. గురువారం మాదేపల్లి వృద్ధాశ్రమం, నగరంలోని విహాన్ చారిటబుల్ ట్రస్ట్ అనాథాశ్రమానికి బియ్యం, కందిపప్పు తదితర నిత్యావసర సరుకులను కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ద్వారా పంపిణీ చేశారు. రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయనున్నట్టు కళాశాల అధ్యక్షుడు సాయి రోహిత్ తెలిపారు.

### నేడు ఇంటర్వ్యూలు

**దెందులూరు:** వివిధ కార్పొరేషన్ల రుణాల మంజూరుకు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ఏలూరు ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ శ్రీలత తెలిపారు. ఉదయం గుడివాకలంక, పైడిచింతపాడు, కొక్కిరాయిలంక, కోమటిలంక, ప్రత్తికోళ్లలంక, మల్కాపురం, పెదయాగినమిల్లి గ్రామాల అభ్యర్థులకు మధ్యాహ్నం నుంచి చాటపర్రు గ్రామంలో అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

### నేడు మానూరులో గ్రామసభ

**దెందులూరు:** ఏలూరు రూరల్ మండలం మానూరు ఆర్‌సీఎం చర్చిలో శుక్రవారం మధ్యాహ్నం తహసీల్దార్ శ్రీనివాస్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించనున్నట్టు రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ నాగమణి తెలిపారు. రైతులు, గ్రామస్తులు విధిగా గ్రామ సభకు హాజరుకావాలని ఆమె కోరారు.

### 5, 11, 14 తేదీల్లో సామాజిక విప్లవకారుల జయంతి

**ఏలూరు (టూటౌన్):** సామాజిక విప్లవకారులు బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి ఏప్రిల్ 5న, మహాత్మా జ్యోతిబా పూలే జయంతి 11న, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఏప్రిల్ 14న ఘనంగా నిర్వహించాలని బీసీ సబ్ ప్లాన్ ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల సాధన పోరాట వేదిక జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, కో కన్వీనర్ ఆగొల్లు కృష్ణారావులు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు, కార్యకర్తలు, చేతి వృత్తిదారులు సంఘం నాయకులంతా విజయవంతం చేయాలని పేర్కొన్నారు. సామాజిక విప్లవకారుల జయంతి కార్యక్రమాలు ఉదయం 10 గంటలకు ఆర్‌ఆర్ పేటలోని పోరాట వేదిక జిల్లా కార్యాలయంలో నిర్వహిస్తామని తెలిపారు.

## సహకార సంవత్సరంలో సేవా కార్యక్రమాలు



మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్

**ఏలూరు (ఆర్‌ఆర్‌పేట):** ఐక్యరాజ్య సమితి ఈ సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో నగరానికి చెందిన టెకు బ్యాంక్ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని జిల్లా సహకార అధికారి ఎ.శ్రీనివాస్ అన్నారు. స్థానిక అగ్రహారంలోని టెకు బ్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. తమ బ్యాంకు వద్ద ప్రప్రథమంగా మజ్జిగ చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశామని బ్యాంక్ చైర్మన్ అంబికా ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ ఎం అచ్యుత రావు, బ్యాంకు డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

- ఉప రవాణా కమిషనర్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఉపరవాణా కమిషనర్ షేక్ కరీమ్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రాంతీయ రవాణా అధికారి కృష్ణారావు, వాహన తనిఖీ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.
- జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే బడేటి చంటి ప్రారంభించారు. జిల్లా సహకార అధికారి ఏ. శ్రీనివాస్, ఎస్‌శ్రీంఆర్ పెదబాబు, డీసీఎంఎస్ బీఎం వీఎస్ కృష్ణమోహన్, ఎం సుధాకర రావు, ఎం వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు 9 నుంచి ఉచిత శిక్షణ

**ఏలూరు (ఆర్‌ఆర్‌పేట):** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా గ్రామీణ నిరుద్యోగ యువకులకు రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండిషనింగ్ రిపేర్లలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ కె.శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9 నుంచి ఈ శిక్షణ ప్రారంభమౌతుందని, పూర్తి వివరాలకు సెల్ నెంబర్లు 99485 65256, 90140 40780, 95330 79471లో సంప్రదించాలని పేర్కొన్నారు.



దరఖాస్తులను పరిశీలిస్తున్న సచివాలయ సిబ్బంది



చంటిబిడ్డతో వస్తున్న మహిళ

## అర్జీదారుల అవస్థలు

అర్హులందరికీ కూటమి ప్రభుత్వంలో సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తామని ప్రచారం చేశారు. దీంతో ఏలూరు నియోజకవర్గంలో 5,847 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వీరంతా గురువారం ఏలూరు ఏఎస్సార్ స్టేడియం వద్ద షాదీఖానాలో చేపట్టిన దరఖాస్తుల పరిశీలనకు హాజరయ్యారు. మండుటెండలో వారు తీవ్ర అవస్థలు పడ్డారు. చంటి బిడ్డలతో వచ్చిన వారు మరింత అసౌకర్యానికి గురయ్యారు. ఐతే 407 మందికే సబ్సిడీ రుణాలు మంజూరు చేయనున్నట్టు చెబుతున్నారు.

– సాక్షి ఫొటో గ్రాఫర్ / ఏలూరు



అర్జీలతో వస్తున్న మహిళలు



తమ పిలుపు కోసం పిల్లలతో వేచిఉన్న మహిళలు



షాదీఖానా వద్ద సందడి

## కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

| కూరగాయలు | కిలో ధర | కూరగాయలు | కిలో ధర |
|---|---|---|---|
| టమాటాలు | 20 | అరటి కాయ (1) | 06-08 |
| వంకాయలు (గులాబీ) | 20 | చిక్కుడు కాయలు | 54 |
| వంకాయలు (కాంతులు) | 26 | బీక్లచిక్కుడు | 84 |
| వంకాయలు (తెలుపు) | 26 | చామదుంపలు | 54 |
| బెండకాయలు | 28 | ములక్కాడలు | 08, 10 |
| పచ్చిమిర్చి | 28 | కంద | 76 |
| కాకర కాయలు | 30-36 | బీట్‌రూట్ | 30 |
| బీరకాయలు | 30 | కీరా దోస | 36 |
| బీరకాయలు (పందిరి) | 36 | ఫ్రెంచ్‌బీన్స్ | 120 |
| క్యాబేజీ | 16 | అల్లం | 60 |
| క్యారెట్ | 32 | కొత్తిమీర (కట్ట) | 20 |
| దొండకాయలు | 26 | పాలకూర | 10 |
| బంగాళదుంపలు | 30 | తోటకూర | 10 |
| ఉల్లిపాయలు | 28 | చుక్కకూర | 10 |
| గోరుచిక్కుడు | 36 | గోంగూర | 07-10 |
| దోసకాయలు | 24-26 | పుదీనా | 05 |
| ఆనబకాయ (1) | 20 | క్యాప్సికమ్ | 60 |
| పొట్లకాయ(1) | 20-25 | చిలకడదుంప | 40 |

## ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

### ఏసీ బస్సులు..

| బస్సు రూటు | సమయం | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర) | 21.00 | 31 |
| ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర) | 21.30 | 31 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి) | 22.00 | 37 |
| ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్) | 22.30 | 23 |
| ఏలూరు - తిరుపతి (ఇంద్ర) | 19.00 | రద్దు |

### సూపర్ లగ్జరీ

| బస్సు రూటు | సమయం | సర్వీస్ నంబర్ | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|---|
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ | 21.45 | 4820 | 31 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ | 21.15 | 4822 | 32 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట | 19.30 | 4796 | 23 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం | 19.45 | 4798 | 28 |
| ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం | 20.15 | 4802 | 27 |
| ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం | 21.00 | 4804 | 30 |
| ఏలూరు -ఈసీఐఎల్ | 22.30 | 4814 | 23 |
| ఏలూరు - తిరుపతి | 16.00 | 4830 | 32 |

## ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ఉపకరణాల పంపిణీ



చిన్నారులకు ఉపకరణాలు అందిస్తున్న కలెక్టరు వెట్రిసెల్వి, ఎమ్మెల్యే బడేటి చంటి

**ఏలూరు(మెట్రో):** స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్ష ఏలూరు జిల్లా ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల 500 మంది పిల్లలకు రూ.75 లక్షల విలువ చేసే వివిధ రకాలు ఉపకరణాలను కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎమ్మెల్యే బడేటి చంటి గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టరు వెట్రిసెల్వి మాట్లాడుతూ ఇప్పటి వరకు 852 మంది ప్రత్యేక అవసరాలు పిల్లలకు ఉపకరణాలు పంపిణీ చేసి, రాష్ట్రంలోనే ఏలూరు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని చెప్పారు. ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలు సమాజంలో అందరితో సమానంగా ఎదిగేలా ఉపాధ్యాయుల కృషి చేయాలని, ప్రభుత్వపరంగా కావలసిన సదుపాయాలన్ని కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటరు పి.పంకజ్‌కుమార్, ఐఈ కోఆర్డినేటరు బి.భాస్కర రాజు, అలింకో కంపెనీ ప్రతినిధులు, నగరపాలక కోఆప్షన్ సభ్యుడు పెదబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వ్యాపారాలను ప్రారంభించాలి

**ఏలూరు (టూటౌన్):** బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణాలు పొందే లబ్ధిదారులు స్వయంగా వ్యాపారాలు ప్రారంభించాలని ఎమ్మెల్యే బడేటి చంటి సూచించారు. స్థానిక ఏఎస్సార్ స్టేడియం సమీపంలో షాదిఖానాలో గురువారం చేపట్టిన ఇంటర్వ్యూలను ఆయన, మేయర్ నూర్జహాన్ పరిశీలించారు. ప్రభుత్వం మూడు శ్లాబులుగా సబ్సిడీ రుణాలను ప్రవేశపెట్టి రూ.2 లక్షలు నుంచి రూ.5 లక్షలు వరకు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. ఇందులో రూ.75 వేలు నుంచి రూ.2 లక్షలు వరకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని వివరించారు. ఏలూరు కార్పొరేషన్ పరిధిలో 5847 మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో 407 మందికి రుణాలు మంజూరవుతాయని చెప్పారు. వీరికి రూ.4.50 కోట్లు సబ్సిడీ రూపేనా ఇవ్వనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ ఎ.భానుప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## బెల్ట్ షాపు తొలగించాలని ఫిర్యాదు



కోడూరుపాడులో ఏర్పాటు చేసిన బడ్డీకొట్టు

**భీమడోలు:** కోడూరుపాడులోని గ్రామకంఠం స్థలంలో జనావాసాల మధ్య బెల్ట్ షాపు నిర్వహిస్తున్నారని, వెంటనే దుకాణాన్ని తొలగించాలని గ్రామానికి చెందిన పూని దశరథరామారావు గురువారం భీమడోలు ఎక్సైజ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన దాసరి పెద్దిరాజు అనే వ్యక్తి గ్రామకంఠంలోని స్థలంలో బడ్డీకొట్టు పెట్టి అందులో బెల్ట్ షాపును నిర్వహిస్తున్నాడని, దీని వల్ల కోడూరుపాడు, దుద్దేపూడి, అన్నేవారిగూడెం గ్రామాలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ గ్రామాల ప్రజలు, విద్యార్థులు, మహిళలు ఈ షాపు మీదుగానే తమ గ్రామాలకు వెళ్లాల్సి ఉంటుందని, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మరుతుందని పేర్కొన్నారు. గ్రామకంఠం స్థలాన్ని ఆక్రమించి బడ్డీ కొట్టు ఏర్పాటు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఫిర్యాదుదారుడు తెలిపారు. సంబంధిత అధికారులు పరిశీలించి బడ్డీ కొట్టును తొలగించి, బెల్ట్ షాపును నిర్వహించకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎక్సైజ్ అధికారి శివధారను వివరణ కోరగా బెల్ట్ షాపును నిర్వహిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. బెల్ట్ దుకాణాన్ని నిర్వహిస్తున్నదీ లేనిదీ సిబ్బందితో పరిశీలన చేయించి, తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోపీమూర్తి

**గణపవరం:** ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, హామీలను అమలు చేసే వరకు ఫ్యాప్టో ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళనలు చేస్తామని ఎమ్మెల్సీ బి.గోపీమూర్తి అన్నారు. గురువారం ఆయన గణపవరం ఉన్నత పాఠశాల, జూనియర్ కాలేజీల్లో అధ్యాపకులు, ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన డీఏ బకాయిలన్నీ చెల్లించాలని, కొత్త పీఆర్‌సీ ఏర్పాటు చేయాలని, పాఠశాలల విలీనం ప్రక్రియలో ఉపాధ్యాయుల అభిప్రాయాల మేరకే ముందుకెళ్లాలని, ఉపాధ్యాయులపై పనిభారం తగ్గించి బోధనకు సమయం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం అర్ధవరం, కాశిపాడు, డి.కుముదవల్లి పాఠశాలలకు వెళ్లారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయరామరాజు, సీనియర్ నాయకుడు హోతా ఆంజనేయులు, భవానీప్రసాద్, మండల బాధ్యులు పాల్గొన్నారు.

## మంచినీటి ఎద్దడి నివారణకు కార్యాచరణ



సమీక్షలో పాల్గొన్న ఎంపీపీ శ్రీలక్ష్మి, అధికారులు

**ఉంగుటూరు:** వేసవిలో మంచినీటి ఎద్దడి నివారణకు రూ.44.80 లక్షలతో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామని ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి వెల్లడించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. మంచినీటి సమస్య తలెత్తే గ్రామాలను గుర్తించామన్నారు. ఇప్పటికే డెల్టాలో 13, మెట్టలో ఆరు గ్రామాల్లో ఫిల్టరు బెడ్లలో ఇసుక మార్పిడి పనులు చేశామని, రూ.37.30 లక్షలు వెచ్చించి ఫిల్టరు బెడ్సు సిద్ధం చేశామని చెప్పారు. గోపినాథపట్నంలో మంచినీటి బోరు వేశామన్నారు. గుళ్లపాడులో మరో బోరు వేశామని తెలిపారు. ఎంపీడీఓ రాజు మనోజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామారావు, పీఆర్ ఏఈ కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.